# యోగాంధ్రకు భారీ ఏర్పాట్లు

## వెస్ట్రన్ బైపాస్‌లో యోగా వేదికను పరిశీలించిన అధికారులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు వెస్ట్రన్ బైపాస్‌లో జూన్ 21న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి "యోగాంధ్ర 2026" కార్యక్రమానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. 25 వేల మంది పాల్గొనే ఈ కార్యక్రమానికి సంబంధించిన వేదిక, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. గుంటూరు, రక్షణ న్యూస్




మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 7 జూన్ 2026 పేజీలు : 4



# దేవుడి హుండీకి కన్నేసిన దందా..

ఎపిసోడ్ -2

## శివాలయ నిధులు మింగేసిన ఈవోపై ఆరోపణల తుఫాన్

దేవుడి పేరుతో వచ్చిన దాతల విరాళాలు, ఆలయ ఆదాయం, వెండి వస్తువులు మాయమవుతున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. శివాలయానికి చెందిన రూ.11 లక్షలను అప్పటి ఈవో వెంకటేశ్వరరావు సెల్ఫ్ చెక్కుల ద్వారా డ్రా చేశారన్న విషయం వెలుగులోకి రావడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తూర్పు సత్రం అభివృద్ధి పేరుతో రూ.20 లక్షలకు పైగా వసూలు చేసి వాటి లెక్కలు చూపకపోవడం, ఆలయ ప్రాంగణంలోనే జల్సాలు జరిగాయన్న ఆరోపణలు ఆలయ వ్యవహారాలపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

ఉమ్మడి గుంటూరు రక్షణ బ్యూరో....

సెల్ఫ్ చెక్కులతో రూ.11 లక్షల డ్రా..?
సత్రం అభివృద్ధి పేరుతో మరో రూ.20 లక్షల వసూళ్ల మిస్టరీ
ఆలయ ప్రాంగణంలోనే పార్టీలు, జల్సాలు చేశారన్న ఆరోపణలు
ఇంత జరుగుతున్నా అధికారులు మౌనం ఎందుకు..?

వివరాలు 2లో..

### దాతలు చేసిన భక్తి... జేబుల్లోకి వెళ్లిందా..?"

దేవుడి నిధులను కాపాడాల్సిన వారే దోచుకుంటే ఆలయ పవిత్రత ఎక్కడ నిలుస్తుంది..? సెల్ఫ్ చెక్కులతో లక్షలు డ్రా చేసి, లెక్కలు లేకుండా మాయమైతే అది కేవలం అవినీతి కాదు... భక్తుల నమ్మకానికి జరిగిన ద్రోహం.

### వసూళ్లు... సత్రంలో జల్సాలు... చివరకు ఖాళీ ఖజానా!"

లక్షలు వసూలు చేసి పనుల జాడ లేకపోవడం, ఆలయ ప్రాంగణంలోనే పార్టీలు జరిగాయన్న ఆరోపణలు ప్రజలను షాక్‌కు గురిచేస్తున్నాయి. దేవుడి పేరుతో వచ్చిన ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందే... లేదంటే ఇది చరిత్రలోనే అతిపెద్ద ఆలయ దోపిడీగా మిగిలిపోతుంది.

## ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యం

ప్రత్యేక రక్షణ కిట్లు పంపిణీ చేసిన బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

ఎండలు, ధూళి, కాలుష్యాన్ని లెక్కచేయకుండా రోడ్లపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలను గత ఏడాదితో పోలిస్తే 20 శాతం తగ్గించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కట్టుదిట్టంగా విధులు నిర్వహించాలని సూచించారు. బాపట్ల క్రైమ్ బ్యూరో....



వివరాలు 2లో..

## పోలేరమ్మ కొలుపుల్లో భక్తి సందడి

గ్రామ సంస్కృతిని చాటిన సంబరాలు

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ




భక్తిశ్రద్ధల నడుమ బాపట్ల 24వ వార్డు ఇమ్మడిశెట్టి వారి పాలెంలో నిర్వహిస్తున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి కొలుపుల సంబరాల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, గ్రామస్తులతో కలిసి సంబరాల్లో పాల్గొని గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

## గ్రామానికే డిజిటల్ విప్లవం

నారాకోడూరులో 'సమృద్ధి కేంద్రం' ప్రారంభం

గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యాధునిక డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సహకారంతో గుంటూరు జిల్లా నారాకోడూరులో నిర్మించిన "సమృద్ధి కేంద్రం"ను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి ప్రారంభించారు. వైద్యం నుంచి ఇంటర్నెట్ వరకు, రైతుల నుంచి విద్యార్థుల వరకు 11 విభాగాల సేవలను ఒకే కేంద్రంలో అందించే ఈ ప్రాజెక్ట్ గ్రామీణాభివృద్ధికి కొత్త దిశగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

గుంటూరు రక్షణ న్యూస్




వివరాలు 2లో..

ఒకే చోట 11 సేవలు

గ్రామీణ యువతకు డిజిటల్ దారి

రైతులకు టెక్నాలజీ అండ

సేవలతో గ్రామాభివృద్ధి లక్ష్యం

## ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి బాపట్ల క్రైమ్ బ్యూరో....

బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ప్రత్యేక రక్షణ కిట్లను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ఈ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తీవ్ర ఎండలు, ధూళి, కాలుష్య పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలందిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశముండటంతో వారికి రక్షణగా ప్రత్యేక టోపీలు, డే అండ్ నైట్ కూలింగ్ గ్లాసెస్, మాస్కులు, ాా ప్యాకెట్లు అందజేస్తున్నామని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 20 శాతం తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలని ట్రాఫిక్ సిబ్బందికి ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఒక్క మరణం జరిగినా అది కేవలం ఒక వ్యక్తి ప్రాణ నష్టంతో ముగియదని, ఆ కుటుంబమంతటినీ విషాదంలోకి నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా "శిరోరక్ష -- ప్రాణరక్ష" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాల్లో మరణాలను తగ్గించడమే లక్ష్యమన్నారు. పోలీసుల భయంతో కాకుండా తమ భద్రత కోసం స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం మంది ద్విచక్ర వాహనదారులేనని, హెల్మెట్ ధరించ కపోవడమే ప్రధాన కారణమని చెప్పారు. ప్రతి ప్రయాణ ంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే "ఎస్పీ సంపర్క్" కార్యక్రమంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రతి రెండో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి సమస్యలు వివరించవచ్చన్నా రు. బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ ఎం. రాంబాబు, బాపట్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఆర్. రాంబాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ బాలనాగిరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ పాల్గొన్నారు.

## పోలేరమ్మ కొలుపుల్లో భక్తి సందడి

బాపట్ల రక్షణ న్యూస్...

: గ్రామదేవతల సంబరాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిజమైన ప్రతీకలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల పట్టణంలోని 24వ వార్డు ఇమ్మడిశెట్టి వారి పా లెంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి కొలుపుల సం బరాలకు శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజ య్యారు. ఈ సందర్భంగా గ్రామదేవత పోలేరమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలమాలలు, టెంకాయలు సమర్పించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అన ంతరం గ్రామస్తులతో కలిసి కొలుపుల సంబరాల్లో పాల్గొని సంద డి చేశారు. గ్రామస్తుల ఆతిథ్యాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకా రులను అభినందించి వారి ప్రతిభను కొనియాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత భక్తి శ్రద్ధలతో, శోభాయమానంగా నిర్వహిస్తున్న కొలుపుల సంబరాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయన్నారు. గ్రామస్తులు ఐక్యంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజ యవంతం చేయడం హర్షణీయ మన్నారు. ఇలాంటి సం బరాలను మన సంస్కృతి, సంప్రదా యాలను ప్రతిబింబించేలా నిర్వహిం చడం ద్వారా భావితరాలకు వారసత్వంగా అందించగలుగుతామని వ్యాఖ్యానించారు. పముఖ చార్టర్డ్ అకౌంటెంట్ చాపల సుబ్రమణ్యం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కనక తప్పెట్లు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

# దేవుడి హుండీకి కన్నేసిన దందా..

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి గుంటూరు రక్షణ బ్యూరో....

భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఉండాల్సిన దేవాలయం ఇప్పుడు అవినీతి ఆరోపణల కేంద్రంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శివాలయ నిధుల దుర్వినియోగం, దాతల విరాళాల మాయ, అభివృద్ధి పేరుతో భారీగా వసూళ్లు చేసి వాటి లెక్కలు చూపకపోవడం వంటి అంశాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో ఆలయ పరిపాలనపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఆలయానికి ఈవోగా పనిచేసిన వెంకటేశ్వరరావు సెల్ఫ్ చెక్కుల ద్వారా దాదాపు రూ.11 లక్షల వరకు డ్రా చేశారన్న విషయం ఇప్పుడు కలకలం రేపుతోంది. ఆలయ నిధులను ఏ అవసరానికి వినియోగించారు..? ఎక్కడ ఖర్చు చేశారు..? ఆ ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రికార్డులు ఎక్కడున్నాయి..? అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానం లేకపోవడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది. భక్తులు సమర్పించిన దాతల విరాళాలు, ఆలయ ఆదాయం, వెండి వస్తువులు కూడా తారుమారు అయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవుడి సొమ్ము కూడా వదల్లేదా అంటూ భక్తులు మండిపడుతున్నారు. ముఖ్యంగా వెంకటేశ్వరరావు బదిలీపై వెళ్లి ఏడాది దాటుతున్నా ఇప్పటివరకు ఆలయ కమిటీ గాని, కొత్తగా వచ్చిన ఈవోలు గాని, ప్రజాప్రతినిధులు గాని ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం వెనుక అసలు కారణమేంటన్న చర్చ సాగుతోంది. ఇంత పెద్ద ఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపణలు వస్తున్నా ఏడాది పాటు ఈ విషయం బయటకు రాకపోవడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. కొందరు పెద్దల అండదండలతోనే ఈ వ్యవహారం నెట్టుకొచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయానికి సంబంధించిన లెక్కలు పూర్తిగా గందరగోళంగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే తూర్పు సత్రానికి సంబంధించిన మరో భారీ ఆర్థిక అక్రమం కూడా ఇప్పుడు వెలుగులోకి వస్తోంది. సత్రం అభివృద్ధి పేరుతో కొంతమంది దాదాపు రూ.20 లక్షలకు పైగా వసూలు చేశారన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో, ఎంత మొత్తం పనులకు వినియోగించారో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం. సత్రం నిర్వహణకు ప్రతి నెలా జీతభత్యాలు కలిపి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే ఖర్చవుతుందని చెబుతున్నప్పటికీ, అభివృద్ధి పేరుతో లక్షల్లో వసూళ్లు జరగడం వెనుక అసలు ఉద్దేశమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం సత్రం ఖజానా ఖాళీగా ఉందన్న సమాచారం మరింత అనుమానాలకు కారణమవుతోంది. వసూలు చేసిన నిధులను అభివృద్ధికి కాకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు రాత్రివేళల్లో సత్రంలోనే పార్టీలు పెట్టుకుని ఈవోతో కలిసి జల్సాలు చేశారని, అక్కడే డబ్బులు పంచుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారాయి. దేవాలయానికి అనుబంధంగా ఉన్న సత్రాన్ని కొందరు తమ వ్యక్తిగత అడ్డాగా మార్చుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై "రక్షణ" దినపత్రికలో కథనాలు రావడంతో స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సీరియస్ అయినట్లు సమాచారం. సెల్ఫ్ చెక్కుల ద్వారా రూ.11 లక్షల డ్రా జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే కమిటీ సభ్యులను పిలిపించి ఈవో వెంకటేశ్వరరావు ఖర్చు చేసిన నిధులను రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

"ఇంత పెద్ద వ్యవహారం జరుగుతుంటే ఇప్పటివరకు నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదు" అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. భావదేవుని ఆలయానికి సంబంధించిన పూర్తి లెక్కలు వెంటనే తేల్చి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఇన్ని ఆరోపణలు వస్తున్నప్పటికీ ఈవో వెంకటేశ్వరరావుపై ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసిస్టెంట్ కమిషనర్ నాగయ్యను వివరణ కోరేందుకు "రక్షణ" దినపత్రిక ప్రతినిధి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడం అనుమానాలను మరింత పెంచుతోంది. దేవుడి పేరుతో వచ్చిన నిధులు దారి మళ్లాయా..? ఆలయ ఆస్తులు ఎవరి చేతుల్లోకి వెళ్లాయి..? అభివృద్ధి పేరుతో వసూలు చేసిన లక్షల రూపాయల లెక్కలు ఎక్కడ..? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే ఈ వ్యవహారంపై ప్రభుత్వం, దేవాదాయ శాఖ వెంటనే పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# యోగాంధ్రకు భారీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

గుంటూరు, రక్షణ న్యూస్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న "యోగాంధ్ర 2026" కార్యక్రమ ఏర్పాట్లను అధికారులు శనివారం పరిశీలించారు. గుంటూరు వెస్ట్రన్ బైపాస్ వద్ద రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని 25 వేల మందితో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి. వీర పాండియన్, జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్ తదితర అధికారులు వేదిక ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. యోగ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, రాకపోకల మార్గాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొనే అవకాశముండటంతో భద్రతా ఏర్పాట్లపై కూడా చర్చించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి. వీర పాండియన్ మాట్లాడుతూ యోగా కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. 25 వేల మందితో నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతిలో భాగమైన ప్రాచీన ఆరోగ్య విధానమని అన్నారు. యోగాను ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్న "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" సాధనలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జూన్ 21న జరిగే "యోగాంధ్ర 2026" కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమం విజ యవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సరిత, డీఎస్పీ మురళీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, తహసీల్దార్ హరిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామానికే డిజిటల్ విప్లవం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

"భారత్ నెట్ ఉద్యమి" కేంద్ర పథకం కింద సమృద్ధి గ్రామ ప్రాజెక్ట్ అమలులో భాగంగా గుంటూరు జిల్లా నారాకోడూరులో ఏర్పాటు చేసిన "సమృద్ధి కేంద్రం"ను శనివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సేవలను పరిశీలించారు.గ్రామీణ ప్రజలకు అవసరమైన అనేక సేవలను ఒకే చోట అందించేలా ఈ కేంద్రాన్ని రూపొందించారు. హెల్త్ ఏటీఎం , పోస్టల్ సేవలు, జన ఔషధి కేంద్రం, ఫంత్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం, పీఎం వాణి వైఫై పాయింట్, డ్రోన్ వ్యవసాయ సేవలు, ఫిజిటల్ సర్వీస్ పాయింట్లు వంటి 11 విభాగాలను ఈ కేంద్రంలో ఏర్పాటు చేశారు.కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ గ్రామాలు ఖాళీ కాకుండా యువతకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని అన్నారు. పల్లెల్లో అవకాశాలు పెరిగితేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నారాకోడూరు సమృద్ధి కేంద్రం అలాంటి ఆలోచనలకు నాంది పలికిందని చెప్పారు.ప్రజలు ఎన్నో సేవల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సేవలను ఒకే కేంద్రంలో అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ముఖ్యంగా హెల్త్ ఏటీఎం ద్వారా 60 రకాల వైద్య పరీక్షలను తక్కువ ఖర్చుతో నిర్వహించే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. జన ఔషధి కేంద్రం ద్వారా బయట మార్కెట్ కంటే 50 శాతం తక్కువ ధరలకు మందులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.ఆధార్ అప్డేట్లు, పాస్‌పోర్ట్ అప్లికేషన్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఫోన్ రీచార్జీలు, ఆస్తిపన్ను చెల్లింపులు వంటి అనేక సేవలు ఈ కేంద్రంలో లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు, స్వయం సహాయక సంఘ మహిళలకు ఉపయోగపడేలా స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రైతుల కోసం డ్రోన్ సేవలు, భూసార పరీక్షలు, వ్యవసాయ సలహాలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను గ్రామ స్థాయికి తీసుకువచ్చి రైతులకు అవసరమైన సలహాలు అందజేయనున్నట్లు వివరించారు.గ్రామాల్లో ఆకతాయిల చేష్టలు, మందుబాబుల ఆగడాలను నియంత్రించేందుకు సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.300 లోపు ఖర్చుతో టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను అందించే విధంగా సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు.ఈ పైలట్ ప్రాజెక్టుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు ఈ సమృద్ధి కేంద్రాలను విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పాన్ని గ్రామీణ స్థాయిలో అమలు చేస్తున్న ప్రత్యక్ష ఉదాహరణగా ఈ కేంద్రం నిలుస్తుందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ ప్రజలకు, యువతకు, మహిళలకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పీఎం వాణి వైఫై ద్వారా గ్రామీణ యువతకు వేగవంతమైన ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాంకేతిక సేవలు కూడా రైతులకు ఈ కేంద్రం ద్వారా చేరువవుతాయని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ఏఐ శిక్షణ పూర్తి చేసుకున్న 15 మంది విద్యార్థులకు పెమ్మసాని, ధూళిపాళ్ల నరేంద్ర సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే 100 మంది రైతులకు పీఎండీస్ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్నీ క్రిస్టియానా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం అధికారులు అతుల్ సిన్హా, పరాగ్ అగర్వాల్, వరప్రసాద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ హసన్ భాషా, డీఓటీ డైరెక్టర్ రాధిక, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, టీడీపీ మండల అధ్యక్షుడు రామరాజు, గ్రామ సర్పంచ్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల మోహన్ రావ్ దాడి అమానుషం....



**వేటపాలెం రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం సిద్ధార్థ కాలనీలో చేనేత కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్న చేనేత జనసభ వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల మోహన్‌రావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులను కాపాడాలని ప్రశ్నించినందుకే ఆయనపై ఇనుప రాడ్లతో దాడి చేయడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.సిద్ధార్థ కాలనీలో చేనేత కార్మికుల ఆస్తులను అక్రమంగా లూటీ చేస్తూ భూ కబ్జాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులకు వ్యతిరేకంగా డాక్టర్ మోహన్‌రావు పోరాడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంకెన నేహేమియా, మంకెన కోర్నెలు, మంకెన ఏసోబు, కట్ట శ్రీనివాసరావు, ఎరిచర్ల నవీన్, ఎరిచర్ల సుమతి తదితరులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులే భూ కబ్జాలను ప్రోత్సహించడం బాధాకరమని పేర్కొన్నారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కుమారుడు మద్దులూరి మహేందర్‌నాథ్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.డాక్టర్ మాచర్ల మోహన్‌రావుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, సిద్ధార్థ కాలనీలో జరుగుతున్న భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని ప్రయత్నించడం తగదని హెచ్చరించారు.

# పరిశ్రమల అభివృద్ధికి సీఐఐ సహకారం

**కలెక్టర్‌ను కలిసిన సీఐఐ, యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు**



**గుంటూరు : రక్షణ న్యూస్...**

సీఐఐ విజయవాడ జోన్ చైర్మన్ అభినవ్ కోటగిరి, వైస్ చైర్మన్ దాసరి అన్వేష్, యంగ్ ఇండియన్స్ (వై) అమరావతి వైస్ చైర్మన్ రామ్ నాగార్జునకొండలతో కూడిన ప్రతినిధి బృందం గుంటూరు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, ఆరోగ్య రంగంలో పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రతినిధి బృందం చర్చించింది.ముఖ్యంగా గుంటూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా ఉన్న మిర్చి, పసుపు, పత్తి, పొగాకు పంటలకు విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు సీఐఐ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ప్రతినిధులు తెలిపారు.యంగ్ ఇండియన్స్ అమరావతి చేపడుతున్న యువత, విద్య, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను రామ్ నాగార్జునకొండ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో యువత ఆధారిత అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి యంగ్ ఇండియన్స్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.సీఐఐ, యంగ్ ఇండియన్స్ ప్రతిపాదనలను కలెక్టర్ సానుకూలంగా స్వాగతించారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి, మిర్చి--పసుపు పరిశ్రమల విస్తరణ, యువత ఆధారిత సామాజిక కార్యక్రమాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# యోగాంధ్ర కార్యక్రమాలకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలి

**అధికారులకు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సంజన సిన్హా ఆదేశాలు**

**పల్నాడు, రక్షణ న్యూస్**




ఈ నెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న "యోగాంధ్ర" కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సంజన సిన్హా అధికారులను ఆదేశించారు.శనివారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ర్యాలీలు, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు, వాక్‌థాన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ నెల 7వ తేదీన ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 21వ తేదీన జిల్లా స్థాయిలో భారీ సంఖ్యలో ప్రజలతో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈ నెల 17వ తేదీన కోటప్పకొండలో, 19వ తేదీన అమరావతిలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.యోగాంధ్ర కార్యక్రమాల్లో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల నిర్వహణలో సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు.

# మలేరియా రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి




**మలేరియా మాసోత్సవ పోస్టర్లు విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్**

**బాపట్ల, రక్షణ న్యూస్**

మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన గోడపత్రాలు, ఫ్లెక్సీలను శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అత్యంత అవసరమన్నారు.ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మలేరియా మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, మలేరియా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తెనాలి ఆర్‌డీవో

గుంటూరు, రక్షణ న్యూస్...



తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె. శ్రీరమణి శనివారం జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కె. శ్రీరమణిని జిల్లా కలెక్టర్ అభినందించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తెనాలి డివిజన్‌ను అన్ని విధాలుగా ముందువరుసలో నిలిపేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## 8, 13న మంగళగిరిలో యోగా కార్యక్రమాలు



గుంటూరు రక్షణ న్యూస్

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో భాగంగా ఈ నెల 8న ఉండవల్లి గుహల వద్ద, 13న మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయం వద్ద ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సా యి కాంత్ వర్మ తెలిపారు.ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

## చౌటూరి శ్రీనివాసరావుకు నివాళులు



గుంటూరు : రక్షణ న్యూస్...

గుంటూరు టౌన్‌లోని గోపాల కృష్ణ కాలనీలో కీర్తిశేషులు చౌ టూరి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎస్‌టీ బాయ్స్ హాస్టల్ వార్డెన్ పెదకర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకులు, యా నాది హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు తిరువీధుల శంకర ప్రసా ద్ పాల్గొని పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పి ంచారు.ఈ కార్యక్రమంలో చౌటూరి రామారావు, రవీంద్ర, చేవూరి ప్రభుదాస్ పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్’తో డ్రైన్ల ప్రక్షాళన

## వర్షాకాలానికి సిద్ధమవుతున్న గుంటూరు నగరం

## కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు, రక్షణ న్యూస్...



రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు నగరాన్ని డ్రైనేజీ సమస్యలు లేని సర్వాంగ సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “ఆపరేషన్ క్లీన్ స్వీప్” కార్యక్రమంలో భాగంగా రెండో వారం డ్రైన్ల శుభ్రపరిచే పనులు విజయవంతంగా నిర్వహించినట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా నగరంలోని అన్ని డివిజన్లలో చిన్న, మధ్య తరహా డ్రైన్లను పూర్తిగా గుర్తించి, వాటిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను తొలగించి శుభ్రపరిచినట్లు తెలిపారు. పారిశుద్ధ్య పనుల్లో వేగం పెంచేందుకు ప్రతి డివిజన్‌కు అదనంగా 100 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించి అంతర్గత రహదారులు, కాలువలను సమగ్రంగా శుభ్రం చేయించినట్లు పేర్కొన్నారు.వర్షాకాలంలో నగరంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, వరద ముప్పును నివారించేందుకు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మేజర్ కాలువల ప్రక్షాళన చేపట్టినట్లు తెలిపారు. నగరవ్యాప్తంగా సుమారు 45 కిలోమీటర్ల ప్రధాన మేజర్ డ్రైన్లు, 80 కిలోమీటర్ల మీడియం డ్రైన్లలో అత్యాధునిక యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడికతీత పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు.డ్రైనేజీ వ్యవస్థను వర్షాలకు సిద్ధం చేయడమే మొదటి ప్రాధాన్యతగా తీసుకుని ఇంజి నీరింగ్, పారిశుద్ధ్య విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ఈ వార ంలో ప్రతిరోజూ ఉదయం డ్రెన్ డీసిల్టింగ్, బ్యాక్‌లేన్ శానిటేషన్, నాలాల పిచ్చిమొక్కల తొలగింపు, తుఫాను నీటి కాలువల క్లియరెన్స్, నిల్వ నీటి తొలగింపు, యాంటీ లార్వా చర్యలను ముమ్మరంగా చేపట్టినట్లు చెప్పారు.మధ్యాహ్నం వేళల్లో యంత్రాల సహాయంతో ప్రధాన డ్రైన్ల పూడికతీత, అంతర్గత కాలువల శుభ్రపరిచే పనులు, డ్రైనేజీ అడ్డంకుల తొలగింపు, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులన్నింటినీ ఫోటో డాక్యుమెంటేషన్, నిరంతర నివేదికల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.నగర ప్రజలు కూడా కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ నెల 8 నుంచి 13 వరకు నిర్వహించే “ఆపరేషన్ క్లీన్ స్వీప్” మూడో వారం కార్యక్రమాల్లో నివాస, వాణిజ్య, భారీ వ్యర్థాల ఉత్పత్తిదారులు విస్తృతంగా పాల్గొని గుంటూరును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

## డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్

బాపట్ల, రక్షణ న్యూస్ :



జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విజయవంతమైన అమలులో బ్యాంకులు భాగస్వాములు కావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రుణాల పంపిణీ చేపట్టాలని కోరారు. ప్రాధాన్యతా రంగాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకులు కృషి చేయాలని తెలిపారు.ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి ఆర్థిక సాధికారతకు తోడ్పడాలని బ్యాంకర్లకు సూచించారు. ముఖ్యంగా రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు అనుసంధానం, మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.బ్యాంకుల పనితీరును నివేదికల ఆధారంగా సమీక్షించిన కలెక్టర్ లక్ష్యాల సాధనలో వెనుకబడిన బ్యాంకు మేనేజర్లకు పలు సూచనలు చేశారు. రుణ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.బాపట్ల జిల్లాలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ తెలిపారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఇది సరైన సమయమని పేర్కొన్నారు. జిల్లాలో 85 కిలోమీటర్ల తీర ప్రాంతం విస్తరించి ఉందని, సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.సూర్యలంక బీచ్‌లో జెట్ స్కీ, అడ్వెంచర్ కార్యకలాపాలు, తీర ప్రాంత చేపల ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులు, టోపీలు, కీచైన్లు, మగ్గులు వంటి ఉత్పత్తుల విక్రయాలకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీరందరికీ రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. రుణాల వసూళ్లలో ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఒకే సెక్టార్‌లో అధిక సంఖ్యలో రుణాలు మంజూరు చేయకుండా వివిధ రంగాల్లో రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. ఒక మండలంలో ఒకే రంగానికి ఎక్కువ రుణాలు ఇస్తే వ్యాపార వృద్ధి మందగిస్తుందని, విభిన్న రంగాల్లో రుణాలు మంజూరు చేస్తే ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.అధికారులు ఎప్పటికప్పుడు తమ ఆలోచనలను మెరుగుపరుచుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. నాబార్డ్ నిధులను కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం చేయకుండా జిల్లా అభివృద్ధి దిశగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన క్రెడిట్ ప్లాన్, వివిధ రంగాలకు అందించిన రుణాలు, డిపాజిట్లు, రుణాల–డిపాజిట్ల నిష్పత్తి, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు పురోగతి తదితర అంశాలను సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సింగయ్య, వ్యవసాయ శాఖ జేడీ ఈ. లక్ష్మి, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుగోపాల్, పరిశ్రమల శాఖ మేనేజర్ రామకృష్ణ, మత్స్యశాఖ ఉపసంచాలకులు గాలి దేవుడు, పీడీ మెప్మా ఆనంద్ పాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, యూనియన్ బ్యాంక్ రీజనల్ కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఆర్బీఐ ఎల్‌డీఎం ఎలమంద, నాబార్డ్ డీడీఎం రవికుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టాలి

## స్కానింగ్ సెంటర్లపై కఠిన నిఘా అవసరం : కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్

**బాపట్ల, రక్షణ న్యూస్**

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన లింగ నిర్ధారణ నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించి నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. డెకాయ్ ఆపరేషన్లు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తిగా నిషేధించబడ్డాయని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. స్కానింగ్ సెంటర్ల వద్ద లింగ నిర్ధారణ నియంత్రణకు సంబంధించిన అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చట్ట ఉల్లంఘనలకు తావులేకుండా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో లింగ నిష్పత్తి సమతుల్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పిల్లలపై ఎలాంటి వివక్ష లేకుండా పెంచాలని, ఆడపిల్లలు -- మగపిల్లలకు సమాన హక్కులు ఉన్నాయనే విషయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రుల పెంపకంలోనే లింగ వివక్ష ఉండకూడదన్నారు. అనంతరం ఔషధ దుకాణాలపై పన్నుల వసూళ్ల



అంశంపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆధారంగా చేసుకుని సుమారు 500 ఔషధ దుకాణాలు పనిచేస్తున్నాయని, వాటి ద్వారా భారీ స్థాయిలో ఔషధాల విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు సరైన పన్నులు వసూలు కాకపోవడంపై ప్రశ్నించారు. ఔషధాల విక్రయాలపై చట్టబద్ధంగా వసూలు చేయాల్సిన పన్నులను తప్పనిసరిగా వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఔషధాల విక్రయాలపై ఆరు శాతం జీఎస్టీ కచ్చితంగా అమలు కావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం పన్నుల రూపంలో ఎందుకు చేరడం లేదని అధికారులను ప్రశ్నించారు. ప్రతి నెల జీఎస్టీ వసూళ్లపై నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు రత్నమోహన్, డేవిడ్‌సన్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్డర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

## ప్రతి మూడు నెలలకు సమన్వయ సమావేశాలు కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు, రక్షణ న్యూస్...**

: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి బిల్డర్లు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ తెలిపారు.
శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నరెడ్కో ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డర్లు సర్వే దరఖాస్తులను ఫస్ట్ ఇన్ -- ఫస్ట్ అవుట్ విధానంలో పరిష్కరించాలని, రెవెన్యూ సిబ్బంది ఫైళ్ల క్లియరెన్స్ వేగవంతం చేయాలని, భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం లేకుండా చూడాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.
అలాగే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విఎల్టీ తగ్గింపును అమలు చేయాలని ప్రతినిధులు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ అత్యవసర సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు బిల్డర్ల ప్రతినిధులు,



అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఎల్టీ తగ్గింపుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. నిర్మాణ పనులకు నగర రిజర్వాయర్ల నుంచి నీటిని ఇవ్వడం సాధ్యం కాదని, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్సులో ట్రీట్మెంట్ అనంతరం వచ్చే నీటిని వినియోగించుకోవచ్చని సూచించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరు, మార్టేజ్ విడుదల ప్రక్రియలను వేగవంతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, నరెడ్కో క్యాపిటల్ జోన్ అధ్యక్షుడు కెసిహెచ్. అంకారావు, కార్యదర్శి ఎం. శ్రీనివాస్, గద్దె తిరుపతిరావు, చుక్కపల్లి రమేష్, శ్రీనివాస్ కుమార్, హరి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షేక్ నాసర్ సైదా కు కీలక పదవి...

**పల్నాడు జిల్లా, రక్షణ న్యూస్**



గురజాల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా షేక్ నాసర్ సైదా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వైఎస్సార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకుడు ఎనుముల మురళీధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మైనార్టీ సంక్షేమానికి కృషి చేస్తానని షేక్ నాసర్ సైదా పేర్కొన్నారు.

# లబ్ధిదారులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ

## అద్దాలు అందజేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం : రక్షణ న్యూస్...**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న లబ్ధిదారులకు శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు కంటి అద్దాలు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన హోంమంత్రి అనిత

**దర్శి రక్షణ న్యూస్...**

అంబేద్కర్ ఆశయాల సాధనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం దర్శి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ గత రెండేళ్లుగా అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం



పనిచేస్తోందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని పేర్కొన్నారు. దర్శి ప్రాంతంలో కూడా శాంతిభద్రతలు మెరుగుపడి ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. దర్శి ప్రాంత అభివృద్ధికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేస్తున్న కృషిని హోంమంత్రి అభినందించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆదరణ కొనసాగించాలని కోరారు. త్వరలో దర్శిలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలిసి పర్యటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, మహిళా నాయకులు, టీడీపీ సీనియర్ నేతలు, ఎస్సీ సోదరులు, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.